


# మొక్కు

టెంపోరావ్

పరంధామయ్య కాళ్ళీడ్చుకుంటూ గోపాలం యింటికి చేరుకున్నాడు.

"గోపాలంగారూ!" అని పిల్చి తెరచివున్న తలుపు మీద వేళ్ళతో తట్టాడు.

"ఎవరూ?" అర్చిందొక స్త్రీ లోపలి నుంచి.

"నేనండమ్మా, కిరణా కొట్టు పరంధామయ్యని."

"ఆయన లేడు!"

"ఎప్పుడొచ్చినా వుండరాయన. ఇరవై రూపాయిలకి ఎన్నిసార్లు తిరగాలమ్మా?" అర్చాడతను విసుగ్గా.

మధ్య వయస్సులో పొట్టిగా లావుగా వున్న ఒక స్త్రీ అతడి ముందు ప్రత్యక్షమయింది.

"నీ డబ్బు ఎక్కడికీ పోదయ్యా!"

"పోదని తెలుసమ్మా, నా చేతిలోకి ఎప్పుడొస్తుందా అని నా బెంగ?" అని సణుగుతూ అతడు వెనక్కి తిరిగాడు.

రోడ్డువారగా నడుస్తున్నాడు. రెండు గంటల నుంచి అతడు రోడ్లమ్మట తిరుగుతున్నాడు. ఎందరిళ్ళకో వెళ్ళాడు. ఒక్క పైసా కూడా వసూలు కాలేదు.

కొందరు యింట్లో లేరు. యింట్లో వున్నవాళ్ళ దగ్గర డబ్బు లేదు. వాళ్ళు ఎప్పుడిస్తారో? ఇస్తారో, యివ్వరో!

పరంధామయ్య వ్యాపారంలో నష్టపడి తన కిరాణా కొట్టును అమ్మేశాడు. ఖాతాదార్ల నుంచి రావలసింది రాబట్టుకోడానికి నెల రోజుల్నించి పాటుబడుతున్నాడు.

చెమటతో అతడి దుస్తులు తడిశాయి. నాలుగు రోడ్ల జంక్షన్‌లో నిలబడిన వ్యక్తి వైపు చూశాడతను. లాటరీ టిక్కెట్లు అమ్మే మనిషి!

"ఒక టిక్కెట్టు కొనండయ్యా! రెండు రూపాయలే!" అరుస్తున్నాడతను.

పరంధామయ్య జేబులోకి చెయ్యిని పోనిచ్చి రెండు రూపాయిల నోటును తీశాడు. సంశయిస్తూ కాస్సేపు నిలబడ్డాడు

"అదృష్టం మీదే! కొనండి బాబూ!"

పరంధామయ్య టిక్కెట్లు వెతికి చివరకి ఒకటి తీసుకుని డబ్బు చెల్లించాడు మెల్లిగా యింటి వైపు నడిచాడు. మరెక్కడికీ వెళ్ళే సత్తువ లేదతనికి.

పాతబడిన కొంపలోకి ప్రవేశిస్తూ తనకి పిల్లలు లేనందుకు సంతోషించాడు. వ్యాపారం పోయింది. ఏం చెయ్యాలో, ఎలా బతకాలో తోచడంలేదు. ఈ పరిస్థితుల్లో పిల్లలుంటే యింకా బాధాకరంగా వుండేది.

చాపమీద నిద్రపోతున్న భార్యను తట్టి లేపాడతను. నిద్ర కళ్ళతో అతడి వంక తిరిగిందామె.


"లాటరీ టికెట్ కొన్నానే! అదృష్టముంటే లక్షలు మనకొస్తాయి." అన్నాడతను.

ఆమె వెటకారంగా నవ్వింది.

"అంత అదృష్టముంటే మీ వ్యాపారాన్ని అమ్మవలసి వచ్చేది కాదు. డబ్బు దండగ!" అందామె.

అతడు టికెట్ పైకి తీశాడు.

"ఆ వేంకటేశ్వరుడికి మొక్కుకుంటున్నాను. నాకు లాటరీలో డబ్బొస్తే సగం పట్టుకెళ్ళి హుండీలో వేస్తాను!"




పరంధామయ్య టికట్ దాచాడు. ఆమె వంటింట్లోకి వెళ్తూ, "కాళ్ళు కడుక్కుని భోజనానికి రండి," అంది.

* * *

పరంధామయ్య అదృష్టం పండింది. అతను లక్నో వెళ్లి పదిరోజుల తర్వాత యింటికి తిరిగొచ్చాడు. అతడి మొహం ఫ్లోరసెంట్ ట్యూబ్‌లా వెలుగుతోంది.

భార్య సంతోషంగా అతడిని అహ్వానించింది.

"లాటరీలో పది లక్షలొచ్చింది." అన్నాడతను ఆవేశంతో.

"మనం అదృష్టవంతులమే. మన కొట్టు ఖాతాదారులు కూడా ఇంటికొచ్చి డబ్బు చెల్లించేశారు," అందామె. అతడు ఆనందంతో ఆమె వంక చూశాడు.

"లక్ష్మి మన యింట్లో కూర్చుందే! ఇటుపైన నేను తాకినదంతా బంగారమవుతుంది. ఈసారి పెద్ద వ్యాపారం చేస్తాను," అన్నాడతను.

ఆమె క్షణకాలం మౌనంగా వుండిపోయింది.

"చూడండి, ముందు తిరపతి వెళ్లి మీ మొక్కు చెల్లించాలి."

"అవంతా తర్వాత చూద్దాంలే! వేంకటేశ్వర స్వామికి కావల్సినంత డబ్బుంది. నా లాంటి చిన్నవాడు ఇవ్వక పోయినా ఫరవాలేదు!"

"అలా అనకండి. మొక్కుకున్నది యిచ్చి తీరాలి! చెప్పింది చెయ్యకపోతే కళ్ళు పోతాయి," అందామె.

అతడామె వైపు కోపంగా చూశాడు.

"ఇప్పుడే ట్రెయిన్ దిగి వచ్చాను. మొక్కు చెల్లించాలని నాకు తెలుసులే!" అన్నాడతను విసుగ్గా.

వారం గడిచిపోయింది. కాని అతడు తిరపతి వెళ్లే ప్రయత్నాలు ఏ మాత్రం చేయకపోవడం వలన ఆమె దిగులు పడింది. ఒకనాటి రాత్రి ఆమె మొక్కు గురించి అతడికి జ్ఞాపక ంచేసింది.

"ఎప్పుడో వెళ్లి హుండీలోవేసి వస్తానులే!" అన్నాడతను.

"చూడండి, దురాశ మనుషుల్ని చివరికి దుఃఖంలోకి యీడుస్తుంది. పది లక్షలొచ్చింది. ఆ భగవంతుడు మన కిచ్చాడు. అందులో ఐదే మనది. తతిమ్మాది దేవుడు సొమ్ము. మనం రేపు తిరపతి వెళ్లి హుండీలో వేసి వద్దాం," అందామె.

"చూద్దాంలే," అని అతడు ముఖం పక్కకు తిప్పుకుని కళ్ళుమూశాడు.

పొద్దుట ఆమె భర్త మీద అగ్ని పర్వతంలా సెగలు కక్కుతూ విరుచుకు పడింది.

"ఇవాళ తప్పక వెళ్ళాలి! స్వామితో చెలగాటాలు ఆడితే మీ జీవితం చీకటిమయం అవుతుంది. నా స్నేహితురాలి అన్న యిలాగే మొక్కుకుని లాభం పొందాక స్వామి దగ్గరకు వెళ్లి మొక్కు తీర్చలేదు. అతడు గుడ్డివాడయ్యాడు.

"భగవంతుడి పోరు కంటె నీ పీడ ఎక్కువగా వుందే?" అన్నాడతను విసుగ్గా.

"బస్‌కి టైమవుతోంది. తయారవండి!"

పరంధామయ్యను మరేం గత్యంతరం లేక తిరపతి వెళ్ళడానికి అంగీకరించాడు. భార్య సంతోషించింది. నోట్ల కట్టలను లెఖ్ఖపెట్టి అతను నీలి రంగు అట్టపెట్టెలో పెట్టి, బీరువా అడుగు అరలో దాచి పైన తన దుస్తుల్ని సర్దేశాడు. బీరువాకి తాళం వేశాడు.

ఇద్దరూ యింట్లోంచి బయటకు నడిచారు. అతడు యింటి ముందు తలుపుకు తాళం వేశాడు.

"ఐదు లక్షలు తెస్తున్నారా?" అడిగింది భార్య.

అతడామెను మౌనంగా వుండమని సౌజ్ఞ చేశాడు.

"దేవుడి కిచ్చే డబ్బు గురించి పైకి చెప్పుకోకూడదు!" అని తన చేతిలో వున్న సంచి వైపు చూపించాడు.

"గోవిందా! గోవిందా!" అంటూ ఆమె సంచి వైపు చూసింది.

సుళువుగా వేంకటేశ్వరుని దర్శనం అయింది. ఆమెను ఒక చోట వుండమని అతను హుండీ దగ్గరకు వెళ్ళాడు. తన పని ముగించి కాస్సేపట్లో ఆమె దగ్గరకు తిరిగి వచ్చాడు. ఆమె చూపు సంచీ

మీదకు వెళ్లింది. సంచి ఖాళీగా వున్నట్టుంది. మునపటిలా బరువుగా లేదు: అతడి భుజం మీద నుంచి టర్కిష్ తువ్వాలు వేళ్లాడుతోంది.

"పడేశారా ?"

"వేశాను," అన్నాడతను మెరిసే కళ్లతో.

"ఆ తువ్వాలు ఎక్కడ నుంచి వచ్చింది ?"

"వెర్రిదానా, తువ్వాల్లో నోట్ల కట్టల్ని చుట్టబెట్టి సంచీలోపెట్టి తెచ్చానుగా ?"

ఆమె ఆనందంతో కళ్ళు మూసుకుని చెంపలు వాయించుకుంది. అతడి వెనకనే బయటకు నడిచింది.

* * *

ఇద్దరూ యింటికి తిరిగొచ్చారు.

గుమ్మం ముందు నిలబడి పరంధామయ్య తాళం చెవిని బయటకు తీశాడు. ఎవరెవరికి తిరపతి ప్రసాదం యివ్వాలా అని ఆమె ఆలోచిస్తోంది.

"తాళం తెరిచివుందే!" అర్చాడతను


ఆమె వులిక్కి పడింది. అతడు లోపలకు పరుగెత్తాడు. బీరువా తెరిచాడు. దుస్తులను ఎత్తి చూశాడు. నీలంరంగు అట్టపెట్టె లేదు !

అతడి నోటమ్మట మాట రాలేదు. గచ్చు నేలమీద అతడు కూర్చుండి పోయాడు. మొహాన్ని చేతుల్తో కప్పేసుకున్నాడు.

"ఏమైందండీ ?" అడిగింది భార్య.

"నీ పిండం ! నన్ను తిరపతికి యీడ్చుకెళ్లావు. డబ్బంతా దొంగలు దోచుకుపోయారు !" అన్నాడతను ఏడుస్తూ.

"ఐదు లక్షలూ పోయిందా ?" అడిగిందామె ఆశ్చర్యంగా.




"ఐదు కాదే- పిచ్చి, పది లక్షలు...."

"హుండీలో వెయ్యలేదా ?"

"నీతో అబద్ధం చెప్పానే. ఒక రూపాయి పడేసి అదే ఐదు లక్షలు అనుకోమని స్వామిని ప్రార్థించాను."

"మహా పాపం చేశారు ! అందుకే అంతా తుడుచుకుపోయింది." అని ఆమె పూజగదిలోని విగ్రహం ముందుకు పరుగెత్తింది.

రెండు రోజుల తర్వాత పరంధామయ్య దినపత్రికను చూస్తున్నాడు. మొదటి పేజీలో ముద్రించిన వార్తను అతడు గుండెదడతో చదవసాగాడు.

"వేంకటేశ్వర స్వామి హుండీలో ఐదు లక్షలు !

నిన్న స్వామి హుండీని తెరిచి పరీక్షిస్తూంటె అందులో నీలం రంగు అట్టపెట్టె కనిపించింది. ఆ పెట్టెలో వంద రూపాయిల నోట్ల కట్టలున్నాయి. లెక్కించి చూస్తే ఐదు లక్షలుంది."

"ఏమేవ్ !" పిలాడతను.

"ఏమిటండీ ?" ప్రశ్నించిందామె.

పేపరులోని వార్త చదివి ఆమె కతను వినిపించాడు

ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"చూశావా, ఆ డబ్బు మనదే. నీలి రంగు అట్టపెట్టెలోనే దాచాను. దేవుడి సొమ్ము చివరికి అతడికి చేరింది. కాని నాది నా చేలో లేకుండా పోయింది !" అన్నాడు పరంధామయ్య.

"అది వరు వేశారో హుండీలో ?"

పరంధామయ్య జవాబివ్వలేదు. అదంతా లా జరిగిందో అతడికి తెలియదు !

కాని ఆ రోజున హోటల్ అపోలో యిరవై నుబరు గదిలో కూర్చుని పేపరు చూస్తున్న నాగరాజు, మస్తాన్ లకు అంతా ిలుసు.

"ఐదు లలు అనుకున్న ప్రకారం హుండీలో వే మన మొక్కు తీర్చుకున్నాం," అన్నాడు మస్తాన్.

"మళ్లా మొక్కుకుందాం!" అన్నాడు నాగరాజు.

"స్వామీ, మాకెంత దొరికితే అందులో గం నీదే !" అన్నారు యిద్దరూ భక్తితో.

———